ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


- నిర్లక్ష్యం కారణంగానే అపార నష్టం
- ప్రచారంపై ఉన్న ధ్యాస సహాయక చర్యలపై లేదు


డాక్టర్ దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త

నందికొట్కూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించినా, ఎగువ ప్రాంతాల నుంచి బుడమేరు, కృష్ణా నదికి భారీగా వరద వస్తుందని అధికారులు తెలియజేసినా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విజయవాడ వరదల్లో మునిగిందని వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త దారా సుధీర్ పేర్కొన్నారు. వరదల్లో ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వరద ముంచెత్తుతుందని తెలిసినా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. కరకట్టపై చంద్రబాబు నాయుడు ఇల్లు మునుగుతుందని, ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడుకునేందుకు బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేసి 57 మంది మృతికి కారకులయ్యారని ఆరోపించారు. కేవలం ప్రచార యావతోనే చంద్రబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలకు అడ్డంకిగా మారారన్నారు. ప్రొటోకాల్‌పేరుతో అధికారులను తన వెంట తిప్పుకోవడంతో ప్రజలకు ఆపన్న హస్తం అందించలేకపోయారన్నారు. వరద వచ్చి 9 రోజులవుతున్నా నేటికీ ప్రజలు కోలుకోలేకపోయారని, కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. మృతి చెందిన వారిలో అధిక శాతం ఆకలితోనే తనువు చాలించారని తెలియడం బాధాకరమన్నారు.

క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు


విశేష అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: షష్టిని పురస్కరించుకుని శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో సోమవారం విశేష క్రతువులను నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.

మావో కృషి మరవలేనిది



మావో చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: విప్లవంలో మావో చేసిన కృషి మరవలేనిదని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు నరసింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మావో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మావో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మార్క్సిజం లేని నిజాన్ని అధ్యయనం చేస్తూ చైనా విప్లవాచరణకు వర్తింపజేయుటకు పట్టుదలతో కృషి చేశారన్నారు. వెంకటేశ్వర గౌడ్, ఎల్లనాయుడు, చిన్న పుల్లయ్య, మౌలాలి, సర్దార్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం సొంతంగా కేటాయించిన నిధులకు సంబంధించిన చెక్కులను సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి వరద బాధిత గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రూ.6కోట్లు కేటాయించారన్నారు. మండలంలోని వేంపెంట, బానుముక్కల గ్రామాలను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపీడీఓ గోపీకృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, జిల్లా నాయకులు రామిరెడ్డి, రాము పాల్గొన్నారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


ధ్రువ పత్రం అందుకుంటున్న రామసుబ్బయ్య

పాములపాడు: వడ్డెర సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన ఓర్సు రామసుబ్బయ్యను సోమవారం ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికల ముందు వడ్డెరలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. వడ్డెరుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని చెప్పారు. సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మౌలాలి, నాయకులు వెంకటేష్, శివ భాస్కర్, పుల్లయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం ఎన్నికకు నామినేషన్లు

నందికొట్కూరు: మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికకు సోమవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి ఎస్. చిన్నరంగస్వామి, ప్రధాన కార్యదర్శికి జూపల్లె సాంబశివుడు, కోశాధికారి పదవికి నరసింహులు నామినేషన్లు వేశారు. మాజీ సైనికుల ఎన్నికల రాష్ట్ర అధికారి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 15న కార్యవర్గపు, ఇతర సభ్యులను నామినేషన్ల అనంతరం అదే రోజు ఎన్నిక, ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు.

మహానంది దేవస్థానానికి ట్రాక్టర్ విరాళం



కీని ఈఓకు అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

మహానంది: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం, మేనేజర్లు మహానంది దేవస్థానానికి సోమవారం రూ. 10.50 లక్షల విలువైన ట్రాక్టర్‌ను బహుకరించినట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటీ, ఆర్ఎం సూర్యప్రకాష్, బీఎం రాఘవ యాదవ్ విరాళంగా ఇచ్చారన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను అందజేసినట్లు చెప్పారు.


మిడుతూరులో యువత కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


మండ్లెం, జూపాడుబంగ్లా గ్రామాల్లో నిమజ్జనానికి తీసుకెళ్తున్న వినాయకుని ప్రతిమలు


జూపాడుబంగ్లాలో నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుల ప్రతిమల వద్ద భక్తుల కోలాహలం


కొత్తపల్లి:వీరాపురంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపు


కొత్తపల్లి: గువ్వలకుంట్లలో మట్టి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం కోసం తీసుకెళ్తున్న చిన్నారులు

గంగ ఒడి చేరిన గణనాథుడు

- వైభవంగా గణేశుడి నిమజ్జన వేడుకలు
- ఉల్లాసంగా సాగిన శోభాయాత్ర
- విగ్రహాల ఊరేగింపులో యువత కోలాహలం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వినాయక చవితి సందర్భంగా శనివారం ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి గణనాథుడిని శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు భక్తుల నుంచి ప్రత్యేక పూజలు అందుకున్నాడు విఘ్ననాయకుడు. మూడో రోజు కావడంతో సోమవారం నిమజ్జనానికి తరలించారు. ముందుగా మండపాల నిర్వాహకులు ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేపట్టి, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం విగ్రహాల శోభాయాత్ర వేడుకగా సాగింది. యువకుల కోలాహలం, మేళతాళాలు, ఊరేగింపులో రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా వేడుకలు సాగాయి. ఆయా ప్రాంతాల్లో సమీపంలోని కేసీ కెనాల్, చెరువులు, కుంటల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


కొత్తపల్లిలో నిమజ్జన ఊరేగింపు


వెలుగోడు: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


పాములపాడు: కేసీ కెనాల్‌లో నిమజ్జనం


పగిడ్యాల: నిమజ్జన వేడుకల్లో డప్పు వాయిద్యాలు


నందికొట్కూరు: నిమజ్జనానికి తరలుతున్న దామగట్ల గణేష్ విగ్రహం


పాములపాడులో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న వినాయక విగ్రహాలు

జూపాడుబంగ్లా: తాటిపాడు శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ అత్యధికంగా రూ.30 వేలకు వంగల కృష్ణారెడ్డి వేలం పాడి దక్కించుకొన్నారు.

పగిడ్యాల: గణేష్ నిమజ్జన వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాలను సందర్శించి ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులో పిల్లలు పాల్గొనకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా వహించాలన్నారు. మద్యం సేవించిన వ్యక్తులు వేడుకలకు దూరంగా ఉండాలని కోరారు.ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించకుండా నిబంధనల మేరకు నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగించాలని చెప్పారు.

పాములపాడు: స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశుని లడ్డు రూ.3,100 వేలం పలికింది. పాములపాడుకు చెందిన గాండ్ల నాగరాజు లడ్డును దక్కించుకున్నారు.

మహానంది: గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అంటూ నినదిస్తూ వినాయకుడి నిమజ్జన వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహానంది, తిమ్మాపురం గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో నిమజ్జన వేడుకలు జరిగాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. శోభాయాత్రగా వెళ్లి ఆయా గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో వినాయకుడిని నిమజ్జనం చేశారు. గాజులపల్లె, బుక్కాపురం, గోపవరం, మసీదుపురం, అబ్బీపురం, సీతారామపురం, తమ్మడపల్లె, బొల్లవరం, గాజులపల్లె ఆర్ఎస్ తదితర గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, ఏఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వినాయకుడి చేతిలో ఉన్న లడ్డూలను దక్కించుకునేందుకు స్థానికులు పోటీపడ్డారు. గాజులపల్లెలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రూ. 53వేలు, సినిమా హాల్ వద్ద సుదర్శన్‌రెడ్డి దంపతులు రూ. 11వేలు, అబ్బీపురంలోని రామాలయం వద్ద మంచాల లక్ష్మిరెడ్డి రూ. 29వేలు, కొత్తపేటలో నామాల సుజిత్ రూ. 25వేలు, శివాలయం వద్ద ఉన్న లడ్డూను తలారి పెద్ద మద్దిలేటి రూ. 16వేలు, గొల్లపేటలోని విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను బండారు పుల్లన్న రూ. 12వేలకు దక్కించుకున్నారు.

మండపాల వద్ద అన్నదానాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో సోమవారం వినాయకుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఐదో రోజు బుధవారం వినాయకుని విగ్రహాలను డ్యాం దిగువ భాగంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేయనున్నారు.

వెలుగోడు: పట్టణంలో బాణసంచా పేలుళ్లు, యువకుల నత్యాల నడుమ స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎస్ఐ విష్ణు నారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిశాలలో జరిగిన లడ్డూ వేలం పాటలో అచ్యుత్ కిరణ్ రూ. 31 వేలకు దక్కించుకున్నాడు. వెలుగోడు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 77 వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. పట్టణ శివారులోని గాలేరు వాగులో గణనాథులను నిమజ్జనం చేశారు.

అంబరాన్నంటిన సంబరం

ఆత్మకూరు: పట్టణంలో వినాయకచవితి ఉత్సవాలు అంబరాన్నంటాయి. సోమవారం గణనాథుల శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఉదయం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆర్యవైశ్యులు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, డీఎస్పీ రామాంజి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. పట్టణంలోని మెయిన్‌బజారు, గాంధీచౌక్, తోటగేరి, అర్బన్‌పేట, గొల్లపేట, వెంగళరెడ్డినగర్, పాత నవాజ్ ఏరియా, గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్ తదితర కాలనీల నుంచి సుమారు 42 విగ్రహాలు ఒకదాని వెంట ఒకటి శోభా యాత్రగా బయలుదేరాయి. విగ్రహాల వద్ద యువకులు, పెద్దలు నృత్యాలు, భజనలు, డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. ఈ ఏడాది పెద్ద సంఖ్యలో మహిళలు గణనాథుల నిమజ్జనానికి తరలివచ్చారు. ఆత్మకూరులో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఎస్ఐలు, 80 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. అలాగే మండలంలోని కరివేన, నల్లకాల్వ, వడ్ల రామాపురం, కురుకుంద, కృష్ణాపురం, వెంకటాపురం, సిద్ధాపురం, ముష్టపల్లి, సిద్ధపల్లి గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

ఎస్ఆర్ఎంసీని సందర్శించిన ఎస్పీ ఆదిరాజ్‌సింగ్

ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలు, పాములపాడు మండలం నుంచి గణనాథులు ఎర్రగూడూరు గ్రామంలోని ఎస్ఆర్ఎంసీలో నిమజ్జనం చేశారు. ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ సోమవారం ఎస్ఆర్ఎంసీని సందర్శించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామంజి ఉన్నారు.


సున్నిపెంటలో అన్నదానం


నృత్యం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


ఆత్మకూరులో శోభా యాత్ర


మహానంది: గాజులపల్లెలో నిమజ్జనం


సూచనలు చేస్తున్న ఎస్పీ ఆదిరాజ్‌సింగ్

నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీకామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, ఆంజనేయస్వామి ఆలయాలు, అన్నదానం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీలను లెక్కిస్తామన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే హుండీ కానుకల లెక్కింపునకు సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

సౌందర్యలహరి పారాయణం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై మదనపల్లెకు చెందిన సురభి మహాలక్ష్మీ సత్సంగ సభ్యులతో శివానందలహరి, సౌందర్యలహరి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు, అనంతపురం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 30 మందికిపైభక్తులు పారాయణంలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

వరద బాధితులకు ఆహారం

మిడుతూరు: దక్షిణ ఇండియా సంఘం - నంద్యాల డయాసిస్, మిడుతూరు పాస్ట్రేట్ సభ్యులు, స్త్రీల కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆహార పంపిణీ చేయనున్నట్లు మిడుతూరు పాస్టర్ చల్లా స్టీఫెన్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు దాదాపు 1500 మందికి జొన్నరొట్టె, టమాట కర్రీ తయారు చేసి వాహనంలో తరలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దామగట్ల, మిడుతూరు సంఘం పెద్దలు, స్త్రీలు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గాజులపల్లె గ్రామానికి చెందిన మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజులపల్లె జయరాం, కుటుంబ సభ్యులు సోమవారం రూ. 10,116 విరాళం అందించారు. ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి దాత కుటుంబానికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

వైభవంగా మహానందీశుని పల్లకీ సేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రసాయనాల్లేని కూరగాయలు తినాలి

జూపాడుబంగ్లా: క్రిమిసంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులతో పండించిన రసాయనాల్లేని కూరగాయలు, ఆహార ధాన్యాలను వాడాలని ఏపీఎం అంబమ్మ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్గానిక్ కూరగాయల స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆర్గానిక్ కూరగాయలు, ఆహార ధాన్యాలను వినియోగించటం వల్ల రోగాలు దరిచేరే అవకాశాలు క్రమేణా తగ్గుతాయన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ


మొక్కజొన్న రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

వెలుగోడు: మొక్కజొన్నలో కత్తెర పురుగు పంటను నాశనం చేస్తుందని, నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అన్నారు. అబులాపురం గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను సోమవారం ఆయన పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 20 ఈసీ, 2.5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పంటపైన పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఈమాజక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేసుకోవాలన్నారు. భాస్వరం లోపం ఉంటే మొక్క పెరుగుదల తగ్గి ఆకులు ఊదా రంగులోకి మారుతాయని తెలిపారు. నివారణకు దుక్కిలో 50 కేజీలు ఎకరాకు భాస్వరపు ఎరువును వేయాలన్నారు. 19-19-19 ద్రావణాన్ని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున 4 నుంచి 5 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కత్తెర పురుగు నివారణ కోసం పంట విత్తిన వారానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: ఈ నెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి సోమవారం తెలిపారు. ఈనెల 10వ తేదీన జరగాల్సిన సమావేశం నంద్యాల కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం జరుగుతున్నందున వాయిదా వేసి 11న నిర్వహిస్తున్నామని చెప్పారు.

పడమర ప్రాతకోటలో ఉద్రిక్తత


గాయపడిన ఈదుల రాజశేఖర్, అడ్డాకుల నాగరాజు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోటలో సోమవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాయంత్రం చేపట్టిన గణేష్ నిమజ్జన వేడుకల్లో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపోద్రేక్తులైన రాజు భాయ్ బ్యాచ్ మరో వర్గంపై రాళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘర్షణలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన ఇద్దరు రాజుబాయ్ గణేష్ విగ్రహం ముందు డ్యాన్స్ వేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అతని అనుచరులు వారిపై దాడికి పాల్పడ్డారు. సంతమార్కెట్ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనను తెలుసుకున్న బాధితుల తరఫు వారు దాడి గురించి ప్రశ్నించేందుకు వెళ్లగా..వారిపై కూడా దాడి చేసి గాయపర్చారు. దీంతో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న నందికొట్కూరు రూరల్ సీఐ, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. దత్తు, దత్తు కుమారుడు వినయ్, రాజు భాయ్, మనోహర్, వేణు, రోషన్న దాడి చేశారని బాధితులు పేర్కొన్నారు. ఈదుల రాజశేఖర్, కట్టెల శంకర్, అడ్డాకుల నాగరాజు, సింహాద్రి, అశోక్, అడ్డాకుల కిరణ్ గాయపడగా.. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముచ్చుమర్రి ఎస్ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మాయిల పట్ల అసభ్య ప్రవర్తన ఘర్షణకు దారి తీసిందన్నారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టి ఇరువర్గీయులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ


సహస్ర దీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు


వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వారికి సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

పెళ్లికి నిరాకరించడంతో..


ఆత్మహత్యాయత్నం చేసిన యువతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని శ్రీగిరి కాలనీకి చెందిన పి.నాగమల్లమ్మ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు. యువకుడితో కొద్ది రోజులుగా ప్రేమలో ఉన్నానని, పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నం చేశానని యువతి తెలిపింది.